
## సీఎంసీ ఎదుట అండర్ పాస్ నిర్మాణం




## స్కూటీలో నాగుపాము ప్రత్యక్షం






AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

11-7-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## ఆర్మూర్–సికింద్రాబాద్ రైల్వే లైన్ కోసం కేంద్ర మంత్రికి వినతి




**అక్షరటుడే ఆర్మూర్:** ఆర్మూర్ నుంచి డిచ్‌పల్లి మీదుగా సికింద్రాబాద్‌కు కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ కొత్త లైన్ వల్ల ఆర్మూర్, బాల్కొండ, జగిత్యాల ప్రాంతాల ప్రజలకు హైదరాబాద్ ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని, రవాణా, వ్యాపార రంగాలు అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు రామచంద్ర రావు, చిన్నమలై అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్‌వోపై దాడి.. ఇద్దరిపై కేసు



**అక్షరటుడే, కామారెడ్డి :** ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వో (బూత్ లెవల్ ఆఫీసర్) పై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన కామారెడ్డి పట్టణంలో ఆలస్యంగా వెలుగుచూసింది. రాష్ట్రవ్యాప్తంగా ఓటరు జాబితా మ్యాపింగ్ కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా ప్రభుత్వం నియమించిన బీఎల్‌ఓలు ఓటర్ల వద్దకు వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని సైలాని బాబా కాలనీ సమీపంలో బీఎల్‌ఓ అనిత ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నారు. అయితే, కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు తమకు ఫోటో లేని ఎన్యుమరేషన్ ఫారాలు ఇవ్వాలంటూ బీఎల్‌ఓతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వం సరఫరా చేసిన ఫారాలనే తాము పంపిణీ చేస్తామని, ఫొటోలు లేనివి ఇవ్వడం కుదరదని ఆమె స్పష్టం చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన సదరు వ్యక్తులు బీఎల్‌ఓ చేతిలోని ఫారాలను లాక్కోవడానికి ప్రయత్నించి, ఆమెపై దాడికి పాల్పడ్డారు. బాధితురాలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఎల్‌ఓ ఫిర్యాదు ఆధారంగా ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నరహరి తెలిపారు.



## బాధితులకు న్యాయం చేస్తాం..

**అక్షరటుడే డిచ్‌పల్లి:** కువైట్ దేశంలో హత్యకు గురైన గుగ్లోత్ కైలాస్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉండడంతో పాటు నిందితులకు శిక్ష పడేలా చూస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి తెలిపారు. మండలంలోని కొరట్‌పల్లి తండాకు వెళ్లి బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. కొడుకును కోల్పోయిన తల్లితండ్రులు ఎమ్మెల్యే వద్ద కన్నీరుమున్నీరయ్యారు. ఎలాగైనా తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. స్థానిక పోలీసుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరారీలో ఉన్న మరొకరిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కాగా తక్షణ సాయంగా రూ. 10 వేలు కుటుంబానికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కువైట్ లో కైలాష్ మృతి చెందగా.. పక్క గ్రామస్తులే హత్య చేసినట్లుగా ప్రాథమిక నిర్ధారణ అయిందన్నారు. బతుకు దెరువు కోసం ఇతర దేశాలకు వెళ్లి ఉద్యోగం చేస్తున్న యువకుడు ఇలా అకాల మృతి చెందడం బాధాకరం అన్నారు. ఈ ఘటనలో ఇప్పటికే సంబంధిత అధికారులతో మాట్లాడడంతో పాటు.. ఎన్నారై రాష్ట్ర అధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. ఎన్నారై ద్వారా బాధిత కుటుంబానికి రూ. 5లక్షలు వచ్చేలా కృషి చేస్తానని, ప్రభుత్వం పరంగా అందాల్సిన సహాయం అందిస్తామన్నారు.




నిజామాబాద్ జిల్లాలో దొంగలు రెచ్చిపోయారు. పలు ప్రాంతాల్లో బీభత్సం సృష్టించారు. చైన్ స్నాచింగ్‌లు, మెడికల్ షాప్‌లో చోరీకి పాల్పడ్డారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు.

- అక్షరటుడే, నిజామాబాద్ క్రైం

# దోపిడీ దొంగల హల్‌చల్..

- టాటా సుమోలో వచ్చిన నలుగురు
- ఆర్మూర్‌లో మెడికల్ షాప్‌లో చోరీ
- నిజామాబాద్ నగరంలో రెండుచోట్ల చైన్ స్నాచింగ్
- బాధితులపై దాడిచేసిన దుండగులు
- రంగంలోకి దిగిన పోలీసులు
- మూడు బృందాలను ఏర్పాటు చేసిన సీపీ సాయిచైతన్య

జిల్లాలో అంతరాష్ట్ర దొంగల ముఠా హల్‌చల్ చేసింది. టాటా సుమోలో వచ్చిన నలుగురుతో కూడిన ముఠా బీభత్సం సృష్టించింది. నిర్మల్‌లో అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడిన అనంతరం అర్ధరాత్రి దాటిన తర్వాత జిల్లాలోకి ప్రవేశించిన ముఠా ఆర్మూర్ పట్టణంలోని మెడికల్ షాపు షెట్టర్‌ను ధ్వంసం చేసింది. షాప్‌లోని 1.5 లక్షల నగదును దోచుకుంది.

### నగరంలో చైన్ స్నాచింగ్‌లు..

ఆర్మూర్‌లో మెడికల్ షాపు దోపిడీకి పాల్పడిన అనంతరం నలుగురితో కూడిన ముఠా టాటా సుమోలో నగరంలోకి ప్రవేశించింది. తెల్లవారుజామున విజయ్ పబ్లిక్ స్కూల్ ఎదురుగా ఉన్న శ్రీనివాస్ నగర్ కాలనీలో ఉదయం దుండగులు మహిళపై దాడిచేసి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. అనంతరం అక్కడి నుంచి వారు దుబ్బ ప్రాంతంలోని సబ్‌స్టేషన్ వద్ద ఓ ఇంటి ముందు వాకిలి ఊడుస్తున్న మహిళపై దాడి చేశారు. ఆమెను తీవ్రంగా కొట్టి బంగారు గొలుసు లాక్కున్నారు. ఒక చెవికమ్మ తీసుకోని..మరో చెవికమ్మ తీసేందుకు ప్రయత్నిస్తుండగా ఆమె గట్టిగా కేకలు వేయడంతో వారు పరారయ్యారు.

### వరుస చోరీలతో భయాందోళన..

నగరంలో వరుస చోరీలతో ప్రజల్లో భయాందోళన నెలకొంది. శనివారం రెండు చోట్ల ఏకంగా టాటా సుమోలో వచ్చి చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దుండగులు అనంతరం జిల్లాను వదిలి పారిపోయినట్లు సమాచారం. నెలల వ్యవధిలోనే గొలుసు దొంగతనాలు నగరవాసులను కలవరపెడుతున్నాయి. పలుకేసుల్లో నిందితులు పట్టుబడ్డప్పటికీ చోరీలు మాత్రం ఆగట్లేదు.



### పలు సంఘటనలివే..

నగరంలో నాలుగో టౌన్ పరిధిలో ఓ అగంతకుడు అర్ధ రాత్రి వేళ మా ఇంట్లోకి ప్రవేశించి వృద్ధురాలి మెడల నుంచి గొలుసును తస్కరించాడు. అలాగే బోధన్ ప్రధాన కూడలిలో రద్దీగా ఉన్న రోడ్డుపైనే మహిళ మెడలోని గొలుసును లాక్కెళ్లిన ఘటన గతంలో సంచలనం రేపింది. నగరంలోని గాయత్రి నగర్‌లో సైతం మహిళ మెడల నుంచి చైన్ లాక్కెళ్లేందుకు ప్రయత్నించి దొంగలు విఫలమయ్యారు. మూడో టౌన్ పరిధిలోని దుబ్బ ప్రాంతంలో వాకింగ్ చేస్తున్న మహిళల నుంచి సైతం గొలుసు లాక్కెళ్లేందుకు ముఠా ప్రయత్నించగా ఆమె అలెర్ట్ అయి గొలుసును గట్టిగా పట్టుకోవడంతో దొంగల ప్రయత్నం ఫలించలేదు. ఇలా చైన్ స్నాచింగ్ ముఠాలు రెచ్చిపోయి ప్రవర్తిస్తున్నాయి. ఉదయం పూట బయటకు వచ్చి పనులు చేసుకునేందుకు మహిళలు భయపడే పరిస్థితి నెలకొంది.

### సంఘటనా స్థలానికి సీపీ సాయి చైతన్య..

దుబ్బ ప్రాంతంలో చైన్ స్నాచింగ్ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించారు. సమాచారం తెలుసుకున్న సీపీ సాయి చైతన్య సంఘటన స్థానానికి వెళ్లారు. బాధితులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. పూర్తి వివరాలు సేకరించారు. బ్లూకోల్ట్ సిబ్బంది సేవలు, పెట్రోలింగ్‌పై ఆరా తీశారు.

### సవాలుగా స్వీకరించి..

చైన్‌స్నాచింగ్ ముఠా కేసును పోలీసులు సవాల్‌గా తీసుకున్నారు. దుండగులను పట్టుకునేందుకు సీపీ మూడు ప్రత్యేక బృందాలని ఏర్పాటు చేసినట్లు సమాచారం. డీఎస్పీ శ్రీశైలం ఆధ్వర్యంలో బృందాలు ఇప్పటికే ముఠా అడ్రస్ కనిపెట్టేందుకు రంగంలోకి దిగాయి. త్వరలోనే ఈ ముఠాను పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మానాల

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** తాళ్ల రాంపూర్ గ్రామ సర్పంచ్ బెజ్జారం పావని ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మానాల మోహన్ రెడ్డి శనివారం పరామర్శించారు. పావని చిత్రపటం వద్ద నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వేల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముత్యం రెడ్డి, వైస్ ఛైర్మన్ నర్సారెడ్డి, కమ్మర్‌పల్లి మండల ప్రెసిడెంట్ భాస్కర్, శ్రీనివాస్ రెడ్డి, దేవారెడ్డి, గంగ ప్రసాద్, బాల్కొండ నియోజకవర్గ వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, డొంకేశ్వర్ మండల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



## సర్టిఫికెట్లు ఇవ్వకుంటే కళాశాలల గుర్తింపు రద్దు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలు ఫీజు బకాయిల పేరుతో విద్యార్థులకు ఇంటర్‌సర్టిఫికెట్లు ఇవ్వకుంటే వాటి గుర్తింపును రద్దు చేస్తామని డీఐఈవో రవికుమార్ హచ్చరించారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. గత మార్చి వార్షిక, మే సప్లిమెంటరీ పరీక్షలలో ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు పైచదువుల కోసం టీసీలు, బొనోఫైడ్‌లు, ఇతర ధృవీకరణ పత్రాలు వెంటనే ఇవ్వాలన్నారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసే కళాశాల యాజమాన్యాలపై బోర్డు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తే విద్యార్థులు వెంటనే జిల్లా ఇంటర్ విద్యా కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేటు కళాశాలలపై ఇంటర్ బోర్డుకు నివేదిస్తామని సూచించారు. కొన్ని కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తుండటంతో ఆయన స్పందించారు.

## 'సర్' ప్రక్రియను విజయవంతం చేయాలి..: బొబ్బిలి రామకృష్ణ




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** జిల్లాలో కొనసాగుతున్న 'సర్' ప్రక్రియను అర్బన్ పరిధిలో వంద శాతం పూర్తి చేయాలని నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ కోరారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జీలు, బీఎల్‌ఏలు, సూపర్‌వైజర్లతో 'సర్' ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ.. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం పీసీసీ అధ్యక్షుడి సొంత నియోజకవర్గమని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేసి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఇందుకోసం ఇప్పటికే అన్ని డివిజన్లకు మెంటర్లను నియమించినట్లు తెలిపారు. డివిజన్లలోని ఒక నిర్దిష్ట ప్రాంతంలో పార్టీ నాయకులందరూ అందుబాటులో ఉంటూ, ఓటర్లకు ఫారాలు నింపడంలో సహాయపడాలన్నారు. అవసరమైన చోట ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ఫారాలు సేకరించి, వాటిని పూర్తి చేయడానికి వలంటీర్లను నియమించుకోవాలని పేర్కొన్నారు. కార్పొరేటర్లు, పోటీ చేసి ఓడిపోయిన వారు, బీఎల్‌ఏ సూపర్‌వైజర్లు తమ తమ డివిజన్లలో వలంటీర్లను సమన్వయం చేసుకోవాలన్నారు. నాయకులు రత్నాకర్, జావీద్ అక్రమ్, అర్బన్ ఈఆర్‌వో కోఆర్డినేటర్ అబ్దుల్ వహీద్, డీసీసీ ఉపాధ్యక్షుడు రత్నాకర్ గౌడ్, డీసీసీ కార్పొరేషన్ ఉపాధ్యక్షులు విజయ్ పాల్ రెడ్డి, సలీం, కోశాధికారి సకినాల శివ పాల్గొన్నారు.

## జగన్నాథ రథయాత్రకు రావాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆహ్వానం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఇస్కాన్ కంఠేశ్వర్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన నగరంలో నిర్వహించనున్న శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవ ఆహ్వాన పత్రికను నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్‌కు ఇస్కాన్ ప్రతినిధుల బృందం అందజేసింది. ఈ సందర్భంగా కమిషనర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ... ఇస్కాన్ కంఠేశ్వర్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో వైభవంగా సాగుతున్నాయని కొనియాడారు. నగరంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే ఈ జగన్నాథ రథయాత్ర మహోత్సవంలో నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, భగవంతుని కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు మాదాసు స్వామి యాదవ్, నితాయ్ చంద్ ప్రభు, సుమంత్ ప్రభు, సూర్య ప్రభు, రోహిత్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.



## తెయూలో నియామక ప్రక్రియ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి



**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీలో 2012 నియామక ప్రక్రియ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బాధితుడు వెంకట్ నాయక్ కోరారు. ఈ మేరకు రాజ్యసభ సభ్యులు, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని హైదరాబాద్ లోని ఆయన స్వగృహంలో శనివారం కలిసి విన్నవించాడు. 2012 నుంచి మొదలుకొని ఇప్పటివరకు తెలంగాణ యూనివర్సిటీలో జరుగుతున్న వ్యవహారాలపై ఆయనకు వివరించినట్లు వెంకట్ నాయక్ తెలిపారు. 13ఏళ్లుగా ప్రభుత్వం నాన్చివేత ధోరణి ప్రదర్శిస్తుందని, సమగ్రంగా విచారించి నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఇటీవల పదోన్నతుల విషయంపై సంబంధిత నియామక ప్రక్రియలో నియామకాలు పొందిన అధ్యాపకులు యూనివర్సిటీ ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తూ, వర్సిటీ ప్రతిష్టను దిగజార్చుతున్నారని వివరించినట్లు పేర్కొన్నారు. స్పందించిన వేం నరేందర్ రెడ్డి నియామక అంశంపై యూనివర్సిటీ ఉపకులపతి, రిజిస్ట్రార్‌లతో చర్చిస్తానని, తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు వెంకట్ నాయక్ పేర్కొన్నారు.

## భీమ్‌గల్‌లో ఊర పండుగకు వేళాయె..రెండు రోజుల పాటు వేడుకలు!




**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా నిర్వహించే 'ఊర పండుగ'కు సర్వం సిద్ధమైంది. ఆది, సోమవారాల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు కమిటీ అధ్యక్షుడు కృష్ణ తెలిపారు. పట్టణ ప్రజలందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి పండుగను విజయవంతం చేయాలని కృష్ణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం 7 గంటలకు సాంప్రదాయబద్ధంగా చెట్టు కొట్టడం కార్యక్రమంతో వేడుకలు ప్రారంభమవుతాయి. ఉదయం 9 గంటలకు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లి, వడ్ల సంఘంలో విగ్రహాల కర్రలను అప్పగిస్తారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత భూలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద పూజ కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమవుతాయి. రాత్రి 10 తర్వాత మైసమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాల ప్రారంభంతో మొదటిరోజు వేడుకలు ముగుస్తాయి. సోమవారం ఉదయం 'సరి చల్లడం' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలకు భక్తజన సందోహం నడుమ దేవుడి ఊరేగింపు అత్యంత వైభవంగా సాగుతుంది. మధ్యాహ్నం ఒంటిగంటలకు మాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో సర్వ సమాజ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## రెంజల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి: ఏబీవీపీ

**అక్షరటుడే, ఇందూరు:** రెంజల్ మోడల్ స్కూల్‌లో అవినీతికి పాల్పడుతున్న ప్రిన్సిపాల్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశింధర్ మాట్లాడుతూ.. రెంజల్ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ చేసిన అక్రమాలు జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయన్నారు. ముఖ్యంగా స్కూల్‌లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారితో ప్రిన్సిపాల్ కుమ్మక్కై పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారన్నారు. విద్యార్థుల అటెండెన్స్‌ను ఉదయాన్నే మార్పులు చేస్తూ రెండు వేర్వేరు రిజిస్టర్లు మెయింటైన్ చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ఉపాధ్యాయుల సంతకాలను సైతం ఫోర్జరీ చేస్తూ తీవ్ర నేరానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఒకేషనల్ కోర్సుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను దారి మళ్లించి, వేరే ఒక వ్యక్తి అకౌంట్ ద్వారా ఆ డబ్బులను డ్రా చేసుకున్నారన్నారు. పాఠశాల ప్రాంగణంలో పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ నిబంధనలకు విరుద్ధంగా చెట్ల నరికివేతకు పాల్పడ్డారని శశింధర్ అన్నారు. ఈ అక్రమాలకు సంబంధించి, ఉపాధ్యాయుల సంతకాలు ఫోర్జరీ చేసినట్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు స్వయంగా ప్రిన్సిపాల్ ఒప్పుకున్నప్పటికీ జిల్లా యంత్రాంగం ఇప్పటికీ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌పై వచ్చిన తీవ్ర ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ విజిలెన్స్ తనిఖీలకు ఆదేశించినట్లు తెలుస్తోందన్నారు. విచారణ అధికారుల ముందు తమకు అనుకూలంగా వాంగ్మూలాలు ఇవ్వాలని ప్రిన్సిపాల్ అక్కడి ఉపాధ్యాయులను, సిబ్బందిని బెదిరించడం, ఒత్తిడి తీసుకురావడం ఆయన తప్పులను స్పష్టం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రక్షిత్, చెర్రీ దీపాన్, సాయి, క్షేహిత్, శ్రీసాయి, శివ, సాయికుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అదృశ్యమైన వ్యక్తి అనారోగ్యంతో మృతి

**అక్షరటుడే, మెండరో:** అదృశ్యమైన వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెండోరా మండలం వెల్గటూర్ గ్రామానికి చెందిన ఏరేటి నర్సారెడ్డి (35) 9న ఇంట్లో నుంచి వెళ్లిపోగా, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు నిమిత్త కేసు నమోదు చేశారు. అయితే అతిగా మద్యం సేవించే అలవాటు ఉన్న నర్సారెడ్డికి ఫిట్స్ కూడా వచ్చేది. మతిస్థిమితం లేక ఇంట్లో నుండి వెళ్లిపోయిన ఆయన అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సుదీర్ఘకాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎట్టకేలకు అడుగులు పడ్డాయి. డిచ్‌పల్లి మండలం సీఎంసీ ఎదుట 44వ నంబరు జాతీయ రహదారిపై 'అండర్ పాస్' నిర్మాణానికి మోక్షం లభించింది.

– అక్షరటుడే, డిచ్‌పల్లి




# సీఎంసీ ఎదుట 'అండర్ పాస్' నిర్మాణానికి శ్రీకారం

■ ఏళ్ల డిమాండ్‌కు మోక్షం ■ రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ■ హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఎన్నో ఏళ్లుగా అక్కడి ప్రజలు అండర్ పాస్ కోసం డిమాండ్ చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలతో ఎంతో మంది మృతి చెందడంతో ఆందోళనలు సైతం నిర్వహించారు. దీంతో డిచ్‌పల్లి శివారులోని సీఎంసీ ఎదుట అండర్ పాస్ నిర్మాణానికి అధికారులు ఓకే చెప్పారు. ఈ ప్రాజెక్టు మంజూరు కావడం వెనుక ఎంపీ ధర్మపురి అర్వింద్ చేసిన ప్రత్యేక కృషి ఎంతగానో ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు. స్థానిక ప్రజల ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వం, హైవే అథారిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఇట్టకేలకు పనులు ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టును మొత్తం రూ.24 కోట్ల బడ్జెట్‌తో చేపడుతున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఈ పనులను పర్యవేక్షిస్తుంది. హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం, ఈ నిర్మాణ పనులు అత్యంత పారదర్శకంగా, ప్రమాణాల ప్రకారం జరగనున్నాయి. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే భవిష్యత్తులో ఎందరో ప్రయాణికుల ప్రాణాలను కాపాడే సంజీవనిగా మారబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదని చెప్పొచ్చు. ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే అత్యంత ప్రమాదకరమైన బ్లాక్ స్పాట్ చరిత్ర పుటల్లో కలిసిపోనుంది. గతంలో ఇక్కడ అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి.

### ప్రాజెక్టు వివరాలివి..

డిచ్‌పల్లి సీఎంసీ అండర్ పాస్ నిర్మాణం పేరుతో ఈ నిర్మాణానికి రూ.24కోట్లు వెచ్చిస్తున్నారు. ఏడాదిన్నర టార్గెట్‌గా పనులు జరుగుతున్నాయి. బ్లాక్ స్పాట్ నివారణ, ప్రమాదాల కట్టడి లక్ష్యంగా ఈ అండర్‌పాస్ నిర్మాణం జరుగుతోంది. తొలుత సర్వీస్ రోడ్ల నిర్మాణం కోసం రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. పొక్లెయిన్‌లతో రోడ్డును చదును చేస్తున్నారు. అనంతరం ప్రధాన బ్రిడ్జ్ పనులు చేపట్టనున్నారు. పనుల కార్యాచరణ ప్రణాళిక ప్రకారం, ప్రధాన హైవేపై ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసేందుకు తొలుత ఇరువైపులా సర్వీసు రోడ్లను నిర్మిస్తారు.

### ప్రయాణికుల హర్షం..

సీఎంసీ ఎదుట అండర్ పాస్ పనులు ప్రారంభం కావడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈ బ్లాక్ స్పాట్ వద్ద జరుగుతున్న ఘోర ప్రమాదాలను చూసి భయాందోళనలకు గురైన స్థానికులు, ఇప్పుడు పనులు మొదలుకావడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. పనులు వేగంగా పూర్తి చేసి, అండర్ పాస్‌ను అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

### వంతెన నిర్మించాలని ఆందోళనలు చేశాం



సీఎంసీ ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదాల్లో గతంలో ఎంతో మంది మృతి చెందారు. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. రోడ్డు దాటాలన్నా, డిచ్‌పల్లి స్టేషన్‌కు వెళ్లాలన్నా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడ వంతెన నిర్మించాలని ఎన్నో ఆందోళనలు చేపట్టాం. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న అండర్ ప్రాస్ నిర్మాణ పనులు ప్రారంభం కావడం ఆనందంగా ఉంది.

– సతీష్ రెడ్డి, డిచ్‌పల్లి

### గడువులోపు పూర్తి చేయాలి



ఈ అండర్ పాస్ పూర్తయితే వాహనాల వేగానికి కళ్లెం పడటంతో పాటు, రాంగ్ రూట్ ప్రయాణాలు పూర్తిగా నిలిచిపోతాయి. ముఖ్యంగా సుద్దపల్లి, సాంపల్లి, యానంపల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఈ ప్రాజెక్టు ద్వారా రక్షణ లభించనుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గడువులోపు ప్రాజెక్టు పూర్తి చేయాలి.

– వినోద్, యువకుడు

## రెడ్డి కార్పొరేషన్‌కు వెంటనే పాలకవర్గం నియమించాలి




**అక్షరటుడే, కామారెడ్డి:** రెడ్డి కార్పొరేషన్‌కు వెంటనే పాలకవర్గాలను నియమించాలని రాష్ట్ర రెడ్డి సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు నాగర్తి చంద్రారెడ్డి అన్నారు. శనివారం సదాశివనగర్ మండల కేంద్రంలో రెడ్డి ఐక్యవేదిక నూతన మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి కుటుంబాలకు సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం, ఉపాధి, స్వయం ఉపాధి రుణాలు కార్పొరేషన్ ద్వారా వెంటనే అందించాలని కోరారు. నిధులు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు జుక్కంటి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద రెడ్డి కుటుంబాలు అధికంగా ఉన్నాయని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను యువత ఉద్యోగాలు, రుణాల కోసం వినియోగించుకోవాలని సూచించారు. రెడ్డి అంటే కేవలం వ్యాపారి కాదని, కష్టపడే రైతు కూడా అని ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో నూతనంగా సదాశివనగర్ మండల అధ్యక్షుడిగా డాక్టర్ ఎర్రవట్టి లింగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా కందాడి ప్రవీణ్ రెడ్డిని నియమించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కే. రాజ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి మోతే రాంరెడ్డి, జిల్లా నాయకులు బొక్క ప్రతాప్‌రెడ్డి, బాణాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆలూర్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం..



**అక్షరటుడే, ఆర్మూర్ :** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ముక్కెర విజయ్ ఆధ్వర్యంలో శనివారం మెడికవర్ హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె సంబంధిత వ్యాధుల నిపుణులు, పల్మనాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్‌లతో కూడిన వైద్య బృందం రోగులను పరీక్షించి తగిన వైద్య సూచనలు అందించారు. శిబిరంలో రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), ఈసీజీ, 2డీ ఈకో తదితర వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేయడంతో పాటు తదుపరి చికిత్సపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ముక్కెర విజయ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు గ్రామ స్థాయిలోనే అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు ఈ ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని నిర్వాహకులకు, మెడికవర్ హాస్పిటల్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## స్కూటీలో నాగుపాము ప్రత్యక్షం..



**అక్షరటుడే, కామారెడ్డి:** ఇంటినుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి స్కూటీలో నాగుపాము ప్రత్యక్షమైంది. ఈ సంఘటన కామారెడ్డి పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామానికి చెందిన చౌకి కోటేశ్వర్ తన స్కూటీపై కామారెడ్డికి బయలుదేరాడు. హెడ్ లైట్ ముందు భాగంలో వింత శబ్దం రావడంతో ఇంటర్నేషనల్ హోటల్ సమీపంలో స్కూటీ ఆపి చూడగా నాగుపాము కనిపించింది. దాంతో భయాందోళనకు గురైన కోటేశ్వర్ స్నేహితులకు, మెకానిక్ సమాచారం ఇచ్చాడు. మెకానిక్ సాయంతో స్కూటీ ముందు భాగం ఓపెన్ చేసి నాగుపామును బయటకు పంపించేశారు. నాగుపాము స్కూటీ నుంచి బయటకు వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్నాడు. రోజు మాదిరిగానే స్కూటీని ఇంటిముందు పార్కింగ్ చేసినట్లు కోటేశ్వర్ తెలిపారు.

## తాళ్ల రాంపూర్ సర్పంచ్ కుటుంబానికి ఆర్థిక సాయం



**అక్షరటుడే,డొంకేశ్వర్:** డొంకేశ్వర్ మండల సర్పంచులు తోటి ప్రజా ప్రతినిధి తాళ్ల రాంపూర్ సర్పంచ్ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. తాళ్ల రాంపూర్ సర్పంచ్ బెజ్జోరా పావని ఇటీవల మృతి చెందారు. శనివారం మండల సర్పంచ్ ఫోరం సభ్యులు సర్పంచ్ పావని భర్త పిల్లలను కలిసి వారిని ఓదార్చారు. క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని మండలంలో సర్పంచులంతా కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. బాధిత కుటుంబానికి ముందస్తుగా రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు బట్టు సంజీవరాజ్, అల్లరి గంగాధర్, మూడు ప్రకాష్, రాజారెడ్డి, తొగర్ మహేష్, వేముల దశరథ్, గడ్డం చిన్నారెడ్డి, బైండ్ల శ్రీకాంత్, రాచర్ల భూమన్న, ఆరే గంగాధర్, అట్టోలి సంజీవ్, బానోత్ సుమన్, బరికుంట సుమలతతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఎస్ఐఆర్‌పై బీజేపీ బృందం ఆరా..




**అక్షరటుడే,భీమ్‌గల్:** మండలంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, వేగంగా సాగుతోందని బీజేపీ భీమ్‌గల్ మండల అధ్యక్షుడు అరె రవీందర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని కుప్కల్, జాగిర్యాల్, బెజ్జోరా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఓటరు నమోదు, మార్పులుచేర్పుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొదటగా కుప్కల్ గ్రామంలో బీజేపీ సర్పంచ్ నర్సింగ్ రావు, ఉప సర్పంచ్ రాజేష్‌లతో కలిసి ఓటరు గణన కార్యక్రమ నిర్వహణను రవీందర్ పరిశీలించారు. బూత్ లెవెల్ అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. జాగిర్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బీఆర్ఎస్ సర్పంచ్ గడాల ప్రసాద్, స్థానిక బీజేపీ నాయకులు మహిపాల్, శ్రీనివాస్ యాదవ్‌లతో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షించారు. సేకరించిన ఓటరు గణన పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానాన్ని నిశితంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.